సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం । 18 । ఫిబ్రవరి । 2023



పేలుడు పదార్థాలు పట్టివేత
అక్రమంగా పేలుడు పదార్థాలను ఉపయోగిస్తూ బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. - 8లో



ప్రజా సంక్షేమానికి పెద్దపీట
కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ఆ పార్టీ నేతలు అన్నారు. - 9లో

గరిష్టం/కనిష్టం 35°/16°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రి చలి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరిటౌన్ : దివ్యాంగులు స్వయం ఉపాధి పొందడానికి బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 55 ఏళ్ల వయస్సున్న దివ్యాంగులు అర్హులన్నారు. ఈ నెల 28లోపు tsobmms.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రాచకొండ ఉర్సు ప్రారంభం



గంధం తీసుకెళ్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల, చల్లమల్ల కృష్ణారెడ్డి తదితరులు

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని రాచకొండలో గల గాలిబ్ షాహిద్ దర్గా ఉర్సు ఉత్సవా లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, జర్నలిస్ట్ ఫోరం నాయకుడు పల్లె రవికుమార్, కాంగ్రెస్ నాయకుడు చల్లమల్ల కృష్ణారెడ్డి తదితరులు సంస్థాన్‌నారాయణపురం నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి దర్గాలో సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుత్త ఉమాదేవి, జెడ్పీటీసీ వీరమళ్ల భానుమతి, సర్పంచ్ సికిలమెట్ల శ్రీహరి, ఎంపీటీసీ గాలయ్య, గుత్త ప్రేమ్‌చందర్‌రెడ్డి, జక్కిడి జంగారెడ్డి, రహీంషరీఫ్, బాలునాయక్, తెలంగాణ భిక్షం పాల్గొన్నారు.

మార్కెట్ పాలకవర్గం పదవీకాలం పొడిగింపు



యాకూబ్‌రెడ్డి, చైర్మన్

మోత్కూరు : మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం పదవీకాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 14తో పాలకవర్గం పదవీకాలం ముగిసింది. చైర్మన్ కె.యాకూబ్‌రెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులు ఆరు నెలల పాటు పదవిలో కొనసాగనున్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన హెల్త్ డైరెక్టర్



శ్రీనివాసరావును సన్మానిస్తున్న సిబ్బంది

ఆలేరురూరల్ : మండలంలోని శారాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు సందర్శించారు. రికార్డులను పరిశీలించి ఆస్పత్రిలో అందజేస్తున్న సేవలపై వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. శ్రీనివాస్‌రెడ్డిని ఆస్పత్రి సిబ్బంది సన్మానించారు. ఈకార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్, డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

వైభవంగా ఊంజలి సేవ



సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు, భక్తులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారి తిరు, మాఢవీధి సేవోత్సవాన్ని ఆచార్యులు వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి సేవోత్సవం చేపట్టారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారికి ఊంజలి సేవ నిర్వహించారు. అలాగే శ్రీలక్ష్మీనరసింహస్వామికి విశేష పూజలు చేపట్టారు.

మార్చి 23 లోపు రోడ్ల పనులు పూర్తి చేయండి

సాక్షి,యాదాద్రి : సీసీ రోడ్ల పనులను మార్చి 23లోపు పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పంచాయతీరాజ్ ఇంజనీర్లను ఆదేశించారు. శుక్రవారం సంబంధిత అధికారులతో సమావేశమై పనులపై సమీక్షించారు. పూర్తయిన పనులకు వెంటవెంటనే బిల్స్ చేయాలని ఆదేశించారు. మన ఊరు – మనబడిలో చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. సమీక్షలో డీఆర్‌డీఓ ఉపేందర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, డీఈలు గిరిధర్, హేమంత్, బాలచందర్ పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా యాదాద్రి ఆలయంలో సువర్ణ పుష్పార్చన, అష్టోత్తర పూజ చేయిస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, బీఆర్‌ఎస్ నాయకులు

కేసీఆర్ పేరుపై హోమం, పుష్పార్చన

యాదగిరిగుట్ట : సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన పేరుపై ప్రభుత్వ విప్ గొంగిడి సునీత శుక్రవారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సుదర్శన హోమం, సువర్ణ పుష్పార్చన, అష్టోత్తర పూజ చేయించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ద్వారా దేశంలో గుణాత్మకమైన మార్పులు తీసుకువచ్చేందుకు కేసీఆర్ అ డుగులు వేస్తున్నారని, ఆయన నూరేళ్ల సంతోషంగా ఉండాలని యాదాద్రీశుడిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుధ, ఆలేరు మార్కెట్ మాజీ చైర్మన్ రవీందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ అధ్యక్షుడు పెలిమెల్లి శ్రీధర్‌గౌడ్, పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, యూత్ పట్టణ అధ్యక్షుడు ముక్కెర్ల సతీష్, నాయకులు గునగంటి బాబురావుగౌడ్, మిట్ట వెంకటయ్యగౌడ్, కొమ్మరాజు కరుణాకర్, చిత్తర్ల బాలయ్య, మారెడ్డి కొండల్‌రెడ్డి, సయ్యద్‌బాబా, తోటకూరి మల్లేష్, సుడుగు శ్రీనివాస్‌రెడ్డి, బూడిద అయిలయ్య, నర్సింగం పురుషోత్తం, శివరాత్రి నరేష్, గడ్డం చంద్రం, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

● కమనీయం.. శివపార్వతుల కల్యాణం



యాదాద్రి శివాలయంలో జరుగుతున్న శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భూమి కోసం..!

హైకోర్టును ఆశ్రయించిన రీజినల్ రింగ్ రోడ్డు బాధితులు

- అలైన్‌మెంట్ మార్చాలని ఇప్పటికే అనేక రకాలుగా ఆందోళన కార్యక్రమాలు
- ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేత
- తుది ప్రయత్నంగా న్యాయస్థానం మెట్లెక్కిన రాయగిరి రైతులు
- విచారణ మార్చి 2వ తేదీకి వాయిదా



రీజినల్ రింగ్ రోడ్డు భూ సేకరణ సర్వేను అడ్డుకుంటున్న రాయగిరి రైతులు (ఫైల్)

సాక్షి, యాదాద్రి : రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న భువనగిరి మండలంలోని రాయగిరి రైతులు తుది ప్రయత్నంగా హైకోర్టును ఆశ్రయించారు. తమకు జీవనాధారం లేకుండా చేయొద్దని, అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ అనేక రకాలుగా ఆందోళ కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. ఈ క్రమంలో మనోవేదనతో అస్వస్థతకు గురై కొందరు రైతులు మంచం పట్టగా, ఒకరిద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఎన్నో పోరాటాలు చేసినా అలైన్‌మెంట్ మార్పు ఉండదని తేలిపోవడంతో బాధిత రైతులు న్యాయం కోసం గురువారం న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం విచారణ జరగాల్సి ఉండగా మార్చి 2వ తేదీకి వాయిదా పడింది.

మూడు దఫాలుగా భూములు కోల్పోయిన రైతులు

రాయగిరి రైతులు ఇప్పటికే హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారి, కాళేశ్వరం కాల్వలు, విద్యుత్ టవర్ల కోసం మూడు దఫాలు భూములు కోల్పోయారు. మళ్లీ రీజినల్ రింగ్ రోడ్డు కోసం భూములివ్వక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో భూములు బహిరంగ మార్కెట్‌లో కోట్ల రూపాయలు పలుకుతున్నాయి. కానీ, పరిహారం రూ.లక్షల్లోనే అందనుండడంతో తక్కువ ధరకు భూములు కోల్పోతున్నామన్న ఆవేదనతో రైతుల గుండెలు ఆగిపోతున్నాయి. డిసెంబర్ 7న రాయగిరికి చెందిన బొజ్జు లక్ష్మి, జనవరి 31న బాలెంపల్లికి చెందిన రఘునాథరెడ్డి ప్రాణాలు వదిలారు.

మొదటి నుంచి వ్యతిరేకత

రీజినల్ రింగ్ రోడ్డును రాయగిరి రైతులు మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నారు. గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినప్పటి నుంచి వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నారు. అధికార, ప్రతిపక్ష నాయకులను కలిసి అలైన్‌మెంట్ మార్పించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రధానంగా రాయగిరి, బాలంపల్లి, రెడ్లరేపాక గ్రామాలకు చెందిన రైతులు భూ సర్వేను పలుమార్లు అడ్డుకున్నారు. రాయగిరి పరిధిలో భారీ పోలీస్ బందోబస్తు మధ్య అధికారులు సర్వే పూర్తి చేశారు.

327 పేజీలతో రిట్ పిటిషన్

రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రాయగిరి రైతులు హైకోర్టులో వేసిన రిట్ పిటిషన్‌ను కోర్టు మార్చి 2వ తేదీకి వాయిదా వేసింది. 2022 మార్చిలో జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ కాకుండా 2023 ఆగస్టులో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం భూ సేకరణ చేయడాన్ని సవాల్ చేస్తూ 29 మంది రైతులు కోర్టులో పిటిషన్ వేశారు. 327 పేజీలతో దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై శుక్రవారం కోర్టులో విచారణ జరగాల్సి ఉంది. అయితే విచారణ కాపీ తనకు అందలేని ప్రభుత్వం తరఫు న్యాయవాది చెప్పడంతో మార్చి 2వ తేదీకి విచారణ వాయిదా వేసినట్లు భూ నిర్వాసితుల సంఘం నాయకులు తంగళ్లపల్లి రవికుమార్ తెలిపారు.

1,85,304 ఎకరాలు సేకరించనున్నారు

జిల్లా పరిధిలో చౌటుప్పల్, వలిగొండ, భువనగిరి మున్సిపాలిటీ, భువనగిరి మండలం, యాదగిరిగుట్ట, తుర్కపల్లి మండలాల్లో రీజినల్ రింగ్ రోడ్డు 59.33 కిలో మీటర్ల పొడవు నిర్మించనున్నారు. ఇందుకోసం 1,853,04 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా సర్వే పూర్తి చేశారు. దీని ఆధారంగా త్రీ ఏ నోటిఫికేషన్ జారీ చేయడానికి అధికారులు సిద్ధం అవుతున్నారు. ముందుగా జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లోని భూ వివరాల్లో తేడా ఉన్న సర్వే నంబర్ల ప్రకారం త్రీ ఏ నోటిఫికేషన్ జారీ చేస్తారు. తేడా లేకుంటే త్రీడి నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఆ తర్వాత పరిహారం చెల్లింపు ప్రక్రియ ప్రారంభం కానుంది.

పర్యావరణానికి హాని కలిగించవద్దు

- కలెక్టర్ పమేలా సత్పతి

సాక్షి,యాదాద్రి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఎవరైనా విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ పమేలా సత్పతి హెచ్చరించారు. కలెక్టర్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రోడ్ల వెంట, కమ్యూనిటీ స్థలాలు, పంట పొలాల్లో నిప్పు పెట్టవద్దన్నారు. హరితహారంలో నాటి మొక్కలను సంరక్షించాలని కోరారు. పర్యావరణానికి హాని కలిగించే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం జరిమానాలు విధించనున్నట్లు తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే టోల్ ఫ్రీ నంబర్ 08685 – 293312కు సమాచారం అందజేయాలని కోరారు. ఎంపీడీఓలు, పంచాయతీ అధికారులు పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

పిల్లల దత్తతకు దరఖాస్తు చేసుకోవాలి

సాక్షి,యాదాద్రి : పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు.



దత్తత తీసుకున్న పశ్చిమబెంగాల్ దంపతులకు శిశువును అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

సీఏఆర్‌ఏ గైడ్‌లైన్స్ ప్రకారం పశ్చిమబెంగాల్ దంపతులు శుక్రవారం జిల్లా శిశు గృహకు చెందిన మూడు నెలల చిన్నారిని దత్తత తీసుకున్నారు. వారికి కలెక్టర్ శిశువును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే దత్తత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ, మల్లేష్, బాలల పరిరక్షణ అధికారి పులుగుజ్జ సైదులు, మేనేజర్ సుష్మ, అలివేలు, కవిత, డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.

గర్భిణులకు వ్యాయామం తప్పనిసరి

ఆలేరు రూరల్ : గర్భిణులు వ్యాయామం, నడక అలవర్చుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఆలేరు మండలం కొలనుపాకలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన శుక్రవారం సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. పౌష్టికాహారం తీసుకోవాలని, ఎక్కువగా పప్పు, ఆకు కూరలు, పండ్లు అవసరం అన్నారు. కలెక్టర్‌గా కాకుండా తల్లిగా సూచనలు అందిస్తున్నానని పేర్కొన్నారు. గర్భిణులు క్షేమంగా ఉంటేనే కుటుంబం బాగుంటుందన్నారు. ఐరన్, క్యాల్షియం మాత్రలు విధిగా వేసుకోవాలని తద్వారా బిడ్డకు రక్తహీనత రాకుండా కాపాడుతుందన్నారు. ముఖ్యంగా మేనరికం వివాహాలు జరిగిన కుటుంబాలు జాగ్రత్తగా ఉండాలన్నారు. పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా ముర్రుపా లు తాపాలని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్, ఎంపీడీఓ జ్ఞానప్రకాష్, మెడికల్ ఆఫీసర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కిశోర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి
- కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కటింగ్, రైతులకు ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీ



కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా కట్ చేస్తున్న ఎమ్మెల్యే కిశోర్, కంచర్ల రామకృష్ణారెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి

మోత్కూరు : ఆయిల్‌పామ్ సాగుకు సీఎం కేసీఆర్ ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని, రాష్ట్ర బడ్జెట్‌లోనూ రూ.1000 కోట్లు కేటాయించారని ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. మోత్కూరు మండలం పొలడుగులో రైతు కంచర్ల రామలింగారెడ్డి భూమిలో ఏర్పాటు చేసిన నర్సరీని శుక్రవారం రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డితో కలిసి సందర్శించారు. సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలు పంపిణీ చేసి మాట్లాడారు.ఆయిల్‌పామ్‌తో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. జిల్లాలో 25 వేల ఎకరాలు ఆయిల్‌పామ్ సాగు చేస్తే ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. బునాదిగాని కాల్వకు బస్వాపురం రిజర్వాయర్‌ను అనుసంధాన పరిచి మోత్కూరు ప్రాంతానికి గోదావరి జలాలు తెప్పిస్తానన్నారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 23 జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగుకు అనుమతి పొందినట్లు వివరించారు. జిల్లాలో వెయ్యి ఎకరాల్లో సాగు చేశారని తెలిపారు. సందీప్‌రెడ్డి మాట్లాడుతూ ఉచిత విద్యుత్, రైతుబంధు పథకాలు ప్రవేశపెట్టడంతో పాటు సాగు నీటి ప్రాజెక్టులు నిర్మించడంతో వరి సాగు పెరిగిందన్నారు.అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ ఎండీ ఎం.సురేందర్, జీఎం సుధాకర్ రెడ్డి, జిల్లా ఉద్యానవన అధికారి అన్నపూర్ణ, వ్యవసాయ శాఖ ఏడీ వెంకటేశ్వర్, మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రి, మార్కెట్ కమిటీ చైర్మన్ కె.యాకూబ్‌రెడ్డి, మోత్కూరు, అడ్డగూడూరు ఎంపీపీలు రచ్చ కల్పన, దర్శనాల అంజయ్య, జెడ్పీటీసీలు గోరుపల్లి శారద, శ్రీరాముల జ్యోతి, సింగిల్‌విండో చైర్మన్లు అశోక్‌రెడ్డి, పొన్నాల వెంకటేశ్వర్లు, రైతు బంధు మండల కోఆర్డినేటర్లు కె.సోంమల్లు, జి.పాండరి, టి.మేఘారెడ్డి, సర్పంచ్ మర్రిపల్లి యాదయ్య, ఎంపీటీసీ లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులు పెంచుకోవాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ
- రూ.13.46 కోట్లతో బడ్జెట్ ఆమోదం



సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కౌన్సిలర్లు

భూదాన్‌పోచంపల్లి : మున్సిపాలిటీలు ఆదాయ వనరులు పెంచుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ సూచించారు. శుక్రవారం భూదాన్‌పోచంపల్లి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. చెత్త డంపింగ్ యార్డు, వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. 2023 –24 ఆర్థిక సంవత్సరానికి రూ.13.46 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించినట్లు తెలిపారు. చైర్‌పర్సన్ విజయలక్ష్మీ మాట్లాడుతూ మున్సిపల్ సాధారణ ఆదాయం రూ.3.34 కోట్లు, ప్రణాళికేతర రూ.2.60 కోట్లు, ప్రణాళిక నిధులు రూ.75 లక్షలు, టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.9.65 కోట్లు కలుపుకొని రూ.13.46 కోట్లతో బడ్జెట్‌ను అంచనా వేశామని వెల్లడించారు. ఇందులో సిబ్బంది వేతనాలు రూ.1.60కోట్లు, గ్రీన్ బడ్జెట్ రూ.36.45లక్షలు, నీటి సరఫరాకు రూ. 57.50 లక్షలు, పారిశుద్ధ్య నిర్వహణకు రూ.45.60 లక్షలు, పరిపాలన ఖర్చు రూ. 27.90 లక్షలు, పట్టణ ప్రణాళిక రూ.2.50 లక్షలు, అభివృద్ధి చెందని ప్రాంతాలకు రూ.11.52 లక్షలు, ప్రజాసౌకర్యానికి రూ.10లక్షలు, వార్డుల వారీగా వివిధ పనులకు రూ.13.67కోట్ల అంచనా వ్యయమవుతుందన్నారు. మున్సిపల్ సొంత నిధుల నుంచి 1/3 వంతు విలీన ప్రాంతాలు, బడుగు బలహీనవర్గాలు, మైనార్టీలు, మురికివాడల్లో మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, కౌన్సిలర్లు దారెడ్డి మంజుల వేణురెడ్డి, కొంగరి కృష్ణ, జ్యోతిరంగారెడ్డి, చక్రపాణి, కర్నాటి రవీందర్, గుండు మధు, మల్లారెడ్డి, భోగ భానుమతివిష్ణు, రజితరాజు, దేవరాయకుమార్, కోఆప్షన్ సభ్యులు నర్సింహ, నుస్రత్‌షరీఫ్, రావుల లావణ్యశ్రీను, సయ్యద్ అజ్జు, పబ్లిక్‌హెల్త్ డీఈ మనోరమ, ఏఈ ఏజాజ్ అలీఖాన్, ఏఈలు పాల్గొన్నారు.

వానొస్తే యథాస్థితి!

గుట్టలో అస్తవ్యస్తంగా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీలు

- ప్రమాణాలకు అనుగుణంగా జరగని పనులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- నెల రోజుల్లోనే కూలిపోయే ప్రమాదం

యాదగిరిగుట్ట : యాదాద్రీశుడు కొలువై ఉన్న యాదగిరిగుట్టను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో మున్సిపల్ యంత్రాంగం ముందుకెళ్తోంది. అందులో భాగంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. తొలుత మురుగు సమస్యను తొలగించేందుకు ప్రతి వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కానీ, ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించకపోవడంతో వర్షాలు కురిస్తే యథాస్థితికి చేరే అవకాశం కనిపిస్తోంది. పల్లపు ప్రాంతాలు ముంపుబారిన పడే ప్రమాదం నెలకొంది.

మంజూరైన నిధులు ఇలా..

మున్సిపాలిటీ పరిధిలో 12 వార్డులు ఉన్నాయి.ఇళ్లలో వినియోగించిన నీటిని, వర్షపు నీరు ఖాళీ స్థలాల్లోకి రాకుండా, భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్రతి వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ఉండాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. గత ఏడాది జరిగిన మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీల కోసం రూ.36 లక్షలు కేటాయించారు. వీటిని ఒక్కో వార్డుకు రూ.3 లక్షల చొప్పున కేటాయించారు. అయితే 3,8,12 వార్డుల్లో అప్పటికే అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీలు ఉండడంతో అక్కడ సీసీ రోడ్లు నిర్మించారు. 2వ వార్డులోనూ అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ఉండడంతో ఓపెన్ జిమ్ ప్రహరీ నిర్మాణానికి నిధులను వినియోగించారు. మిగతా వార్డుల్లో నాలుగు నెలల క్రితం అండర్‌డ్రౌండ్ డ్రెయినేజీలు చేపట్టారు. పలు వార్డుల్లో పనులు పూర్తికాగా మరికొన్ని చోట్ల కొనసాగుతున్నాయి, అయితే పనుల నాణ్యతపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేక కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారు.

6వ వార్డులో అధ్వానం

ప్రధానంగా 6వ వార్డుల్లో అధ్వానంగా ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పది సంవత్సరాల పాటు ఉండాల్సిన డ్రెయినేజీలు.. స్వల్పకాలానికే కూలిపోయే విధంగా ఉన్నాయంటున్నారు.



6వ వార్డులో రూ.3లక్షల వ్యయంతో 170 మీటర్ల పొడవునా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మిస్తున్నారు. నిబంధనల ప్రకారం పనులు చేసేటప్పుడు భూమి పొడిగా ఉండాలి. తద్వారా పైపులు భూమిలో కుంగకుండా ఉంటాయి. అయితే ఇక్కడ బురదలోనే పైపులు వేస్తున్నారు. ప్రతి మ్యాన్‌హోల్‌కు మ్యాన్‌హోల్‌కు మధ్య 10 మీటర్ల దూరం, ఒక ఇంచు స్లోప్‌తో పనులు చేపట్టాలి. రెండు ఫీట్ల వెడల్పున్న పైపులు వేయాలి. కానీ, అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, పనులు జరిగే ప్రాంతంలో కాంట్రాక్టర్ ఉండకపోవడంతో కూలీలు ఇష్టానుసారంగా పనులు చేసుకుంటూపోతున్నారు. అంతేకాకుండా పైపైనే పైపులు వేస్తున్నారు.



నాణ్యత పాటించకుండా నిర్మించిన మ్యాన్‌హోల్

పొడిగా ఉన్నప్పుడే పనులు చేయాలి

అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు చేసే సమయంలో భూమిని లెవలింగ్ చేసుకొని నీళ్లు సాఫీగా వెళ్లడానికి స్లోప్ ఉండేలా చూసుకోవాలి. నేల తడిగా ఉన్నప్పుడు పనులు చేపట్టరాదు. పొడిగా ఉండాలి. మ్యాన్‌హోళ్లలో తప్పనిసరిగా ఎం.15 గ్రేడ్ కాంక్రీట్ వినియోగించాలి. పనుల నాణ్యతను పరిశీలిస్తాం.

–నవీన్, ఇన్‌చార్జ్ ఏఈ, యాదగిరిగుట్ట మున్సిపాలిటీ

క్యూరింగ్ చేస్తలేరు



పైప్‌లైన్ అస్తవ్యస్తంగా ఉంది. పైప్‌లైన్ చుట్టూ సిమెంట్ పనులు పైపైన చేసి వదిలేశారు. ఇక మ్యాన్‌హోల్స్ రెండు, మూడు రోజులకే కూలిపోయే పరిస్థితి ఉంది. వాటిని నిర్మించినప్పటి నుంచి క్యూరింగ్ కోసం నీళ్లు పట్టలేదు. పనులను అధికారులు పర్యవేక్షించాలి.

–ఆరె శంకర్, 6వ వార్డు

పాత డ్రెయినేజీ రాయి పక్కదారి

యాదగిరిగుట్ట గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు ఏర్పాటు చేసిన డ్రెయినేజీల స్థానంలో అండర్‌గ్రౌండ్ డ్రెయిన్‌లను నిర్మిస్తున్నారు. పాత డ్రెయినేజీలను తొలగించడంతో అప్పట్లో నిర్మాణానికి ఉపయోగించిన గ్రానైట్ రాళ్లు పెద్ద ఎత్తున బయటపడుతున్నాయి. అయితే కాంట్రాక్టర్, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇళ్లు నిర్మించుకుంటున్న వ్యక్తులు, వెంచర్ల కోసం రాత్రి సమయంలో ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. లక్షల రూపాయలు విలువ చేసే గ్రానైట్ రాయి పక్కదారి పడుతుండడంతో మున్సిపాలిటీ ఆదాయానికి గండిపడుతోంది.

శవ పరీక్షలపై ఎయిమ్స్‌లో వర్క్‌షాప్

బీబీనగర్ : బీబీనగర్ ఎయిమ్స్‌లోని ఫోరెన్సిక్ మెడిసిన్, టాక్సికాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం శవ పరీక్షలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా శవ పరీక్షలకు నిర్వహించే నాన్ ఇన్వాసిస్ టెక్నిక్, వాటిపై జరుగుతున్న అధ్యయనంపై చర్చించారు. అంతేకాకుండా శవ పరీక్షల్లో ఫోరెన్సిక్ వైద్యులకు ఎదురవుతున్న ఇబ్బందులు తదితర అంశాలపై కూడా చర్చించారు. వైద్యరంగలో అందుబాటులోకి వస్తున్న ఆధునిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ సమస్యలను అధిగమించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పలువురు వైద్యాధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా, వైద్యులు ప్రజ్ఞేష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న డైరెక్టర్ వికాస్ భాటియా, వైద్యులు

క్లుప్తంగా

ప్రజా సమస్యలు గాలికొదిలేశారు



మాట్లాడుతున్న పీవీ శ్యాంసుందర్‌రావు

యాదగిరిగుట్ట రూరల్ : నియోజకవర్గంలోని సమస్యలను స్థానిక ఎమ్మెల్యే గాలికొదిలేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు విమర్శించారు. యాదగిరిగుట్ట మండలం గౌరాయపల్లిలో శుక్రవారం నిర్వహించిన ప్రజాగోస – బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి కనీస వసతులు కల్పించడం లేదన్నారు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, లో లెవల్ వంతెనల వద్ద ప్రాణాలు పోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ గుంటిపల్లి సత్యనారాయణ, జిల్లా కోశాధికారి కాదూరి అచ్చయ్య, మండల పార్టీ అధ్యక్షులు క్లెం శ్రీనివాస్‌గౌడ్, చిరిగే శ్రీనివాస్, నల్ల పోశెట్టి, కంఠం పాండు, కానుగంటి శ్రీనివాస్ రెడ్డి, పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

గుండాల : బైక్ అదుపుతప్పి కిందపడడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని రామారం గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుద్దాల గ్రామ పశు వైద్యశాలలో జూనియర్ వెటర్నరీ అధికారిగా పని చేస్తున్న బాలరాజు విధులు ముగించుకొని సాయంత్రం బైక్‌పై తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రామారం గ్రామ శివారులో బైక్‌పై నుంచి జారి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108 వాహనంలో నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు.

పథకాలను అర్హులకు అందించాలి

భువనగిరిటౌన్ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు అర్హులకు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్ అన్నారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయ సమావేశం మందిరంలో 3వ (వ్యవసాయం) స్థాయీ సంఘం సమావేశంలో ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర సరఫరాల శాఖ అధికారులు పర్యవేక్షణ కొరవడడంతో గ్యాస్ సిలిండర్ల డెలివరీ బాయ్‌లు ప్రజల వద్ద అదనంగా రూ. 50 చొప్పు వసూలు చేస్తున్నారన్నారు. అదే విధంగా పలు హోటళ్లలో డొమస్టిక్ సిలిండర్లను వినియోగిస్తున్నారని, క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని డీసీఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు. రైతులకు ఎరువులు విత్తనాలు, క్రిమి సంహారక మందుల ఎమ్మార్పీ రేటుకు అందించే విధంగా చూడాలని డీఏఓను ఆదేశించారు. రబీలో దాదాపు 5లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి గోపీకృష్ణ వివరించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సుబ్బూరు బీరు మల్లయ్య, పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం

మిర్యాలగూడ అర్బన్ : ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధమైంది.ఈ ఘటన పట్టణంలోని హనుమాన్‌పేటలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమాన్‌పేటలో గుడిసెలో నివాసముంటున్న మారయ్య శుక్రవారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో మంటలు చెలరేగాయి. దీంతో వస్తువులకు మంటలు అంటుకుని దగ్ధమయ్యాయి. సుమారు నాలుగు లక్షల విలువైన సామగ్రితో పాటు సర్టిఫికెట్లు పూర్తిగా కాలిపోయాయి. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే పూరిగుడిసె దగ్ధమైనట్లు స్థానికులు పేర్కొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

- 284 కిలోల గంజాయి, కారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అపూర్వరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : నిషేధిత గంజాయిని రవాణా చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి 284 కిలోల గంజాయితో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ ఎస్పీ అపూర్వరావు నిందితుడి వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం పెరియార్ నగర్ శక్తి ఇల్లామ్ గ్రామానికి చెందిన శక్తి తనిగైరాజు హోటల్ నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. కరోనా సమయంలో వ్యాపారం దెబ్బతినగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఈ క్రమంలో సులభంగా డబ్బు సంపాదించాలని గంజాయిని విక్రయిస్తున్నాడు.

ఏపీ పోలీసుల నుంచి తప్పించుకుని..

శక్తితనిగైరాజు ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రి సమీపంలోని నర్సీపట్నానికి చెందిన వీరబాబు, కృష్ణల వద్ద రెండు కిలోల తూకం ఉన్న 142 గంజాయి ప్యాకెట్లను తక్కువ ధరకు కొనుగోలు చేశాడు. వాటిని కారులో తమిళనాడుకు తరలిస్తున్నాడు. ఈ క్రమంలో టోలపల్లి టోల్‌ప్లాజా వద్ద ఏపీ పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా తప్పించుకున్నాడు. అక్కడినుంచి నాగార్జునసాగర్ వైపు వస్తున్నట్లు నల్లగొండ పోలీసులకు సమాచారం అందింది. దీంతో పెద్దవూర వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టగా శక్తితనిగైరాజు కారును వదిలి పారిపోయాడు. సమీపంలోని సబ్‌స్టేషన్ గోడ దూకేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారని వివరించారు. ఎవరైన చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు. కేసును ఛేదించిన మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి, పెద్దవూర సీఐ నాగరాజు, ఎస్సై పరమేష్, హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌బాబు, కానిస్టేబుల్ కిషన్, హోంగార్డు మట్టయ్యలను అభినందించారు.



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు, కారు

పేలుడు పదార్థాలు పట్టివేత

- ఇద్దరి అరెస్ట్.. 30డిటోనేటర్లు, 16 జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర



మాట్లాడుతున్న డీసీపీ రాజేష్ చంద్ర

భువనగిరి : అక్రమంగా పేలుడు పదార్థాలను ఉపయోగిస్తూ రాళ్లను ధ్వంసం చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు డీసీపీ రాజేష్ చంద్ర తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలును వెల్లడించారు. నారాయణపురం మండలం సర్వేల్ గ్రామానికి చెందిన వరికుప్పల నగేష్ బీబీనగర్ మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 200లోని పల్ల వెంకటరమణరెడ్డి వెంచర్‌లో రాళ్లను తొలగించేందుకు ఇటీవల రూ. 20 వేలకు ఒప్పందం చేసుకున్నాడు. అడ్వాన్స్‌గా రూ. 6 వేలు తీసుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 16న వెంచర్‌లో తన బంధువైన చౌటుప్పల్ మండలం కేసారం గ్రామానికి చెందిన ఆలకుంట్ల రమేష్‌తో కలిసి జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లను తీసుకుని వెళ్లాడు. వెంచర్ సూపర్‌వైజర్ నేదునూరి కొండల్‌రెడ్డితో మాట్లాడి వెంచర్‌లో రాళ్లను తొలగిస్తున్నట్లు పోలీసులకు అందిన సమాచారంతో బీబీనగర్, భువనగిరి ప్రత్యేక పోలీసులు కలిసి దాడి చేశారు. ఈ సమయంలో వారి నుంచి 30 డిటోనేటర్లు, 16 జిలెటిన్ స్టిక్స్, వైర్లు, కంపరేషర్ వాహనం స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. సమావేశంలో భువనగిరి ఏసీపీ వెంకట్‌రెడ్డి, రూరల్ సీఐ వెంకటయ్య, బీబీనగర్ ఎస్సై సైదులు పాల్గొన్నారు.

దేవలమ్మనాగారం శోకసంద్రం



అంత్యక్రియలను పురస్కరించుకొని మృతుల ఇళ్ల వద్ద గ్రామస్తులు



నివాళులర్పిస్తున్న చలమళ్ల కృష్ణారెడ్డి

- నలుగురు మహిళల మృతదేహాలకు ముగిసిన అంత్యక్రియలు

చౌటుప్పల్ : దండుమల్కాపురం గ్రామంలోని గ్రీన్ ఇండస్ట్రీయల్ పార్కులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండల పరిధిలోని దేవలమ్మనాగారం గ్రామానికి చెందిన మహిళలు వరకాంతం అనసూయ, డాకోజి నాగలక్ష్మి, దేవరపల్లి శిరీష, సిలివేరు ధనలక్ష్మిల మృతదేహాలకు శుక్రవారం అంత్యక్రియలు పూర్తయ్యాయి. చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం వేర్వేరుగా అంత్యక్రియలు చేశారు. శవయాత్రలో ఆయా కుటుంబాల బంధువులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఒకే రోజు నలుగురి అంత్యక్రియలు జరగడంతో గ్రామంలో ప్రజలంతా దుఃఖంలో మునిగిపోయారు. అత్యంత చిన్న వయసు కలిగిన డాకోజి నాగలక్ష్మి ఇద్దరు కుమారులు, కుమార్తెతో పాటు దేవరపల్లి శిరీష కుమారులు తమ తల్లుల మృతదేహాలను చూసిగ తల్లడిల్లారు. తెలిసీతెలియని వయసులో ఉన్న ఆ చిన్నారులను బుజ్జగించేందుకు ఆయా కుటుంబీకులు ఎంతగానో శ్రమించాల్సి వచ్చింది. ఆ దృశ్యాలు చూసిన ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులను పీసీసీ ప్రధాన కార్యదర్శి చలమళ్ల కృష్ణారెడ్డి పరామర్శించారు.

తల్లిదండ్రులు మందలించారని ..

- పురుగుల మందు తాగిన బాలిక
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

యాదగిరిగుట్ట : తల్లిందండ్రులు మందలించారని మనస్తాపంతో పురుగుల మందు తాగిన బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. యాదగిరిగుట్ట పట్టణ సీఐ సైదయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని కొత్తగుండ్లపల్లికి చెందిన బండి శ్రీహరికి 15 సంవత్సరాల కుమార్తె ఉంది. బాలిక పాఠశాలకు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన మైనర్ ఇంట్లోనే గత నెల 19వ తేదీన పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు బాలికను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. తండ్రి బండి శ్రీహరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదయ్య తెలిపారు.

వాటర్ షెడ్ నిర్మాణ పనుల పరిశీలన



చెక్ డ్యామ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వలిగొండ : మండలంలోని పులిగిల్ల, సుంకిశాల, కంచనపల్లి గ్రామాల్లోని వాటర్ షెడ్ నిర్మాణ పనులను శుక్రవారం జాతీయ జల జీవన్ మిషన్ శాస్త్రవేత్తల బృందం సభ్యులు జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెక్ డ్యామ్, నీటి కుంటలను, ఫారం పాండు, రోడ్డు పక్కన నాటిన ప్లాంటేషన్, పల్లెప్రకృతి వనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తల బృందం ప్రతినిధి జలశక్తి అభియాన్ శాస్త్రవేత్త యాదయ్య మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణతోపాటు భూగర్భజల మట్టాలను పెంచి నీటి వనరుల వినియోగ ప్రక్రియలో భాగంగా చేపట్టిన వాటర్ షెడ్ నిర్మాణాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జలశక్తి అభియాన్ అడిషన్ డైరక్టర్ ఆఫ్ వాటర్ మిషన్ అనంతరాములు, డీఆర్డీఓ నాగిరెడ్డి, ఏపీడీ శ్యామల, ఎంపీడీఓ గీతారెడ్డి, సర్పంచ్ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



మృతురాలి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామంలోని గ్రీన్ ఇండస్ట్రీయల్ పార్కులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన దేవలమ్మనాగారం గ్రామానికి చెందిన వరకాంతం అనసూయ, డాకోజి నాగలక్ష్మి, సిలివేరు ధనలక్ష్మి, దేవరపల్లి శిరీష మృతదేహాలను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అన్ని విధాల అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మృతులు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేల చొప్పున ఆర్థికసాయాన్ని ప్రకటించారు. పిల్లల విద్యాభ్యాసానికి అండగా ఉంటానని తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, కౌన్సిలర్లు పోలోజు శ్రీధర్ బాబు, కొయ్యడ సైదులుగౌడ్, మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, ఎంపీటీసీ సుర్గు రాజమ్మ, సర్పంచ్ గుడ్డేటి యాదయ్య, నాయకులు కంది లక్ష్మారెడ్డి, వరకాంతం జంగారెడ్డి, వర్కాల మహేందర్, సుర్గు శ్రీను, కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, చీరిక రంగారెడ్డి, బక్క శ్రీనాథ్, పెద్దిటి చంద్రారెడ్డి ఉన్నారు.

సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- యాదాద్రి కలెక్టర్ పమేలా సత్పతి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరి : స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం యువ టీం ఆధ్వర్యంలో పట్టణంలోని గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని 165 పదోతరగతి విద్యార్థులు రూ. 35వేలు విలువ చేసే స్టడీ మెటరీయల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిర్దేశించుకున్న లక్ష్య సాధన కోసం విద్యార్థులు కృషి చేసి ఉన్నత స్థాయికి ఎదగలన్నారు. రాబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పుస్తకాలు అందజేస్తే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. విద్యార్థుల కోసం యువటీం చేస్తున్న సేవలను ఆమె అభినందించారు. కార్యక్రమంలో యువ టీం కన్వీనర్ సూదగాని రాజు, ప్రధానోపాధ్యాయులు సుజాత, ఉపాధ్యాయులు పాశం కృష్ణమూర్తి, శర్మ, యువ టీం సభ్యులు రావుల సుధాకర్, మంచి కంటి భానుచందర్, చిన్నగారి నితీష్, రాజు, సాయితేజ, చరణ్, మహేష్, సుగుణాకర్, మేఘనాథ్, అభినయ్, మనీష్ పాల్గొన్నారు.

లేక్‌వ్యూ పార్కు సుందరీకరణ బాగుంది

- యాదాద్రి అదనపు కలెక్టర్ దీపక్ తివారీ



లేక్‌వ్యూ పార్కును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జలాల్‌పురంలోని లేక్‌వ్యూ పార్కు సుందరీకరణ ఎంతో బాగుందని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. శుక్రవారం ఆయన లేక్‌వ్యూ పార్కును సందర్శించి అక్కడ జరుగుతున్న సుందరీకరణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా యోగా పాయింట్లో ఏర్పాటు చేసిన బుద్ధ విగ్రహం ప్రత్యేక ఆకర్షణ ఉందని, అలాగే పిల్లల ఆట పరికరాలు, జంతువుల బొమ్మలు, ఓపెన్ జిమ్, పక్కనే చెరువు ఎంతో ఆహ్లాదకరంగా ఉన్నాయని కొనియాడారు. ఈయన వెంట ఎంపీడీఓ బాలశంకర్, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, సర్పంచ్ పర్నె రజిత మల్లారెడ్డి, ఎంపీఓ మాజిద్, ఉపసర్పంచ్ బైరు బాలరాజు, పంచాయతీకార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అడిషనల్ కలెక్టర్‌కు వినతి

పోచంపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఎస్సీ కులానికి చెందిన పారిశుధ్య కార్మికులపై మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ కుల వివక్షత చూపిస్తున్నారని, విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్‌కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీని ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొమ్ము లక్ష్మణ్, వడ్డేపల్లి యాదగిరి కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఎస్సీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయడంలో సీనియారిటీని పరిగణలోకి తీసుకోవడంలేదని ఆరోపించారు.

త్వరలో అండర్ పాస్ పనులు ప్రారంభం

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



వంగపల్లిలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్

యాదగిరిగుట్ట రూరల్: హైదరాబాద్–వరంగల్ ప్రధాన జాతీయ రహదారిలో వంగపల్లి వద్ద అండర్ పాస్ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత తెలిపారు. మండలంలోని వంగపల్లి గ్రామంలో 5.52 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు మరమ్మతు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. వంగపల్లి బైపాస్ నుంచి మొదలుకుని, పలు గ్రామాలను కలుపుకుని, మోటకొండూర్ మండలం మీదుగా, ఆత్మకూరు మండలంలోని కప్రాయపల్లి వరకు రోడ్డు పనులు జరుగుతాయని ప్రభుత్వ విప్ పేర్కొన్నారు. ఎన్‌హెచ్163 ప్రధాన జాతీయ రహదారిలో వంగపల్లి వద్ద, వంగపల్లి–మోటకొండూర్ వెళ్లే రహదారిలో అండర్ పాస్ నిర్మాణం కావాలని పలుమార్లు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రోడ్డు పనుల నిధులు మంజూరుకు కృషి చేసిన మంత్రులు ప్రశాంత్ రెడ్డి, జగదీశ్‌రెడ్డికి ధన్యవాదములు తెలిపారు.

ఫంక్షన్‌హాల్‌కు శంకుస్థాపన

వంగపల్లిలో గ్రామస్తుల అవసరాలకు పీఆర్ నిధులు రూ.కోటితో చేపడుతున్న ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డితో కలిసి ప్రభుత్వ విప్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, ఎంపీపీ చీర శ్రీశైలం, జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, పార్టీ మండల అధ్యక్షులు కర్రె వెంకటయ్య, సర్పంచ్‌లు తోటకూరి బీరయ్య, కానుగు కవిత బాలరాజ్ గౌడ్, ఆరె స్వరూప మల్లేష్ గౌడ్, ఉపసర్పంచ్ రేపాక స్వామి పాల్గొన్నారు.

భువనగిరి ఖిలాపై విద్యార్థుల సందడి

భువనగిరి : భువనగిరి ఖిలాపై శుక్రవారం సందర్శకుల సందడి నెలకొంది. సిద్దిపేట జిల్లాలోని వేద పాఠశాలకు చెందిన 123, మేడ్చల్ జిల్లాకు చెందిన విద్యాజ్యోతి పాఠశాలకు చెందిన 45 మంది విద్యార్థులు విజ్ఞాన విహార యాత్రలో భాగంగా భువనగిరి ఖిల్లాను సందర్శించారు. ఈ సందర్భంగా ఖిలాపై చారిత్రాత్మక కట్టడాలు, కోలనులు, కోటలను తిలకించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సంతోష్, శోభారాణి, మంగ అనిత, అనిల్, భాస్కర్, కృష్ణవేణి హిందుస్థాన్ స్కౌట్ అండ్ గైడ్స్ ప్రతినిధులు ఉన్నారు.



భువనగిరి ఖిలాపై ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఖిలాను సందర్శించిన జర్మని దేశస్తులు

జర్మని దేశానికి చెందిన బ్లూ జాన్, ఎలిజిబెత్‌లు భువనగిరి ఖిలాను సందర్శించారు. భువనగిరి ఖిలాను అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా వారికి గైడ్‌గా ఆవుల వినోద్ ఖిలా చరిత్ర వివరాలను తెలియజేశారు.



ఖిలాపై జర్మనీ దేశస్తులు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం

బీబీనగర్: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతిచెందారు. బీబీనగర్, మోటకొండూర్, జాజిరెడ్డిగూడెం, హుజూర్‌నగర్,భువనగిరి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. బీబీనగర్ మండలం వెంకిర్యాల గ్రామానికి చెందిన పెద్దరాముల భిక్షపతి(51) గురువారం మండల కేంద్రానికి బస్సులో వచ్చాడు. అనంతరం ఇందిరమ్మ కాలనీ వరకు వెళ్లడానికి వాహనాల సౌకర్యం లేకపోవడంతో రోడ్డుపై బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని లిఫ్ట్ అడిగి ఎక్కాడు. మార్గమధ్యలో బైక్ వేగంగా వెళ్లడంతో భిక్షపతి వెనుక నుంచి అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో గాయపడ్డాడు. అతడిని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని ఒకరు..

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన రాఘవేంద్ర సూపర్ మార్కెట్ యజమాని ఉప్పాల శ్రీహరి (77) తన మోటార్ సైకిల్‌పై కోదాడ రోడ్ వైపు ఉన్న పీఎస్‌టీ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు దాటుతునన్నాడు. ఈ క్రమంలో కోదాడ నుంచి హుజూర్ నగర్ వైపు వస్తున్న లారీ శ్రీహరి స్కూటీని ఢీ కొట్టాడు. దీంతో శ్రీహరి తలకు, ఎడమ కాలుకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు ఉప్పాల సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎంపీ ఉత్తమ్, మాజీ ఎమ్మెల్యే పద్మావతి సంతాపం

పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉప్పల శ్రీహరి రోడ్డు ప్రమాదంలో మరణించడం చాలా బాధాకరం అని ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మావతి సంతాపం తెలిపి, సానుభూతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని పేర్కొన్నారు.



శ్రీహరి (ఫైల్)

ఎమ్మెల్యే పరామర్శ

రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన శ్రీహరి కుటుంబాన్ని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి రజిత దంపతులు పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. శ్రీహరి రోడ్డు ప్రమాదంలో చనిపోవడం తీవ్రంగా కలిచి వేసిందని వారు పేర్కొన్నారు. వారి వెంట పలువురు నాయకులు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

భువనగిరి : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ శివారులోని అనంతారం ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి గుర్త తెలియని వ్యక్తి మద్యం మత్తులో అనంతారం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై రోడ్డు మార్గం మధ్యలో కూర్చున్నాడు. ఈ సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాఘవేంధర్‌గౌడ్ తెలిపారు.

మోపెడ్ పైనుంచి కిందపడి..

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం చాకలిగూడెం గ్రామానికి చెందిన అక్కెనపల్లి యాదగిరి(57), ఆయన కుమారుడు సత్యనారాయణలు ఇద్దరు శుక్రవారం గ్రామం నుంచి మోపెడ్‌పై సూర్యాపేట జిల్లా జనరల్ ఆసుపత్రికి బయలుదేరారు. మార్గమధ్యలో 365బీ హైవేపై తిమ్మాపురం శివారులో జమ్మన్లబోడు వద్ద సూర్యాపేట మండలం రాజనాయక్‌తండాకు చెందిన మోతీలాల్ ఒక్కసారిగా ఎదురురావడంతో ఆయనను తప్పించబోయి మోపెడ్ అదుపు తప్పి పడిపోవడంతో యాదగిరి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే ఈ మోపెడ్ నడుపుతున్న కుమారుడు సత్యనారాయణకు గాయాలయ్యాయి. అలాగే మోపెడ్‌కు ఎదురొచ్చిన మోతీలాల్ కూడా గాయపడ్డాడు. గాయపడిన వారిని 108అంబులెన్సులో సూర్యాపేట జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. కాగా యాదగిరి మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి బావ బాసాని యాదగిరి ఫిర్యాదు మేరకు అర్వపల్లి ఏఎస్ఐ కె.కృష్ణమూర్తి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనాస్థలిలో యాదగిరి మృతదేహం

బైక్ పైనుంచి కిందపడి..

మోటకొండూర్: తుర్కపల్లి మండలం దత్తపల్లి గ్రామానికి చెందిన కోట సంపత్‌కుమార్ (21) స్నేహితులైన కనకరాజు, బిల్ల బాలుతో కలిసి గురువారం రాత్రి బైక్‌పై ఆలేరు మండలంలోని గొలనుకొండలో డీజే ఆపరేటింగ్‌కు వెళ్లారు. కాగా పని పూర్తి కాగానే శుక్రవారం తెల్లవారుజామున బైక్‌పై తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మోటకొండూర్ మండలంలోని మాటూర్ శివారు ప్రాంతంలోని కాటమయ్య టెంపుల్ వద్ద అదుపు తప్పి ద్విచక్రవాహనం గుంతలో పడింది. దీంతో కోట సంపత్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. సంపత్ తండ్రి రామచంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధు తెలిపారు.



సంపత్(ఫైల్)